# ‘వ్యవసాయరంగాన్ని కబళిస్తున్న బహుళజాతి కంపెనీలు-పాలకుల విధానాలు’ అంశంపై సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ ఎం.ఎస్. నాగరాజు

**నందిగామ, 25-4-17 :**

కృష్ణాజిల్లా నందిగామలో క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ హాలులో 25-4-17న రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లాస్థాయిలో సదస్సు జరిగింది. ‘వ్యవసాయ రంగాన్ని కబళిస్తున్న బహుళజాతి కంపెనీలు-పాలకుల విధానాల’పై జరిగిన ఈ సదస్సుకు అధ్యక్షవర్గంగా కా॥తలశిల లీలామనోహర్, బి.వెంకటేశ్వర్లు, యాదల నాగేశ్వరరావులు వ్యవహరించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర)రాష్ట్రనాయకులు కామ్రేడ్ ఎమ్.ఎస్.నాగరాజు సదస్సును ప్రారంభిస్తూ వ్యవసాయరంగ సంక్షోభానికి గల కారణాలను చర్చించుకునేందుకు ఈ సదస్సును జరుపుకుంటున్నామన్నారు. ‘ఈదేశంలో ఉత్పత్తి అయ్యే ఆహారపంటలకు సరైన ధరలను ఏర్పాటు చేయటం లేదు. విదేశాలతో మిలాఖతు అయ్యి పెట్టుబడిదారులు మార్కెట్‌పై గుత్తాధిపత్యం పొందారు. వీరికి వంతపాడే పాలకవర్గాలు అందరూ కలసి రైతును మోసం చేస్తూనే వున్నారు. రైతాంగాన్ని మార్కెట్ శక్తులకు వదిలేశారు. రైతు పెట్టే పెట్టుబడి-దిగుబడి - జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకొని న్యాయమైన ధరలు నిర్ణయించటం సర్తెందిగా ఉంటుంది. కానీ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు భూమిపై రైతులకుండే హక్కును తొలగించి ఈ భూములను సరికొత్త భూస్వామ్యవర్గం, బహుళజాతి కంపెనీలు, మిలాఖత్ సంస్థలు స్వాధీనం చేసుకోవటం కోసం-వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీయకుండా చేస్తూ, రైతులే స్వచ్ఛందంగా భూములను వదలివెళ్లేలాగా వ్యవహరిస్తున్నారు. భూమిపై హక్కును నిలబెట్టుకోవడానికి, వ్యవసాయరంగాన్ని కాపాడుకోవటానికి ఒక బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం నేడు మనముందు వుందంటూ, రైతాంగం ఉద్యమాల బాటలోకి రావాల’ని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

సదస్సు అంశంపై అవగాహనా పత్రాన్ని రైకూసం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షుడు కా॥ రాంబాబు ప్రవేశ పెట్టాడు. దీనిపై చర్చను నిర్వహించారు.

రైకూసం(ఆం.ప్ర.)రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ వై. సోనీ మాట్లాడుతూ ‘రాష్ట్రంలో, దేశంలో కరువు కాటకాలను పాలకులే పెంచిపోషిసున్నారు. సాగునీటిని ఇవ్వకపోవటంవలన ప్రతిజిల్లాలో లక్షల ఎకరాలు సాగుకావటం లేదు. రైతులు, కూలీలు వలసలకు వెళ్లిపోతున్నారు. అనంతపురం జిల్లా పరిస్థితి అయితే చాలా ఘోరంగా ఉంది. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసలకు వెళ్లిపోయారు. ఈ సంక్షోభం నుంచి బయట పడాలంటే రైతాంగ ఉద్యమాలు తప్ప అడ్డదారులు లేవు. ఇప్పటికైనా సరైన దారిని ఎంచుకొని ఉద్యమించాల’న్నారు.

సంఘం జిల్లా కార్యదర్శి కా॥ వీరబాబు మాట్లాడుతూ, ‘గాట్ ఒప్పందం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ పోటీ వలన మంచిధర లభిస్తుందని పాలకులు అన్నారు. అంతర్జాతీయ వ్యాపారానికి అనుగుణమైన పంటల సాగును ప్రోత్సహించారు. తిరిగి ఈనాడు అంతర్జాతీయంగా ఎగుమతులు లేవని అందుకే ధరలు తగ్గాయిని కొద్దిసేపు, ఉత్పత్తి పెరిగింది కనుక ధరలు తగ్గాయని మరొకసారి వాదనలు తెస్తూ రైతులను పాలకులు, దళారులు, బహుళజాతికంపెనీలు దివాలా తీయిస్తూ ఆత్మహత్యలవైపుకు నడిపిస్తున్నారు. ఈదశలో రైతాంగం తమ మనుగడ కోసం నిలకడైన బలమైన ఉద్యమాలు నిర్మించాల’న్నారు.

ఈ సదస్సులో రైకూసం(ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ జె. జగన్ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై 15 తీర్మానాలను ప్రవేశపెట్టగా సదస్సు ఆమోదించింది. ఈ సదస్సుకు ముందు నందిగామ పట్టణంలో రైతుకూలీలు ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు పాడిన పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.

oooo